మహిళా కార్మికులకు ఆటవిడుపు అవసరం

- మేయర్ స్రవంతి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటల పోటీలు



మ్యూజికల్ చైర్ పోటీలో పాల్గొన్న మహిళలు

నెల్లూరు(బారకాసు)/ నెల్లూరు(వీఆర్సీ సెంటర్) : పనిఒత్తిడి, కుటుంబ బాధల్లో నిమగ్నమై పనిచేసే మహిళా ఉద్యోగులు, కార్మికులకు ఆటవిడుపు అవసరమని నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు, ఆప్కాస్ ఉద్యోగులకు స్థానిక ఏసీ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం వద్ద వివిధ రకాల ఆటలు, పాటల పోటీలను శనివారం నిర్వహించారు. ముందుగా వీర జవాన్ పి.మురళి నాయక్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ సరిహద్దుల్లో శత్రువుల బారి నుంచి ప్రజలను, దేశాన్ని కాపాడేది వీర జవాన్లు అయితే నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే సైనికులు పారిశుద్ధ్య కార్మికులని తెలిపారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మస్తాన్ బీ మాట్లాడుతూ పారిశుద్ధ్య మహిళల ప్రతిభను పోటీల సందర్భంగా వెలికి తేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘ నగర గౌరవాధ్యక్షుడు పి.సూర్యనారాయణ, ఐద్వానగర అధ్యక్ష, కార్యదర్శులు కత్తి పద్మ, ఎన్వీ సుబ్బమ్మ, సంపూర్ణమ్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.అశోక్, మట్టిపాటి శ్రీనివాసులు, జి.కామాక్షమ్మ, టి.భాగ్యమ్మ, జి.కొండమ్మ, టి.సలోమి, మనోజ్, తాళ్లూరి రమేష్, శివ, షఫీ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వీరజవాన్ మురళి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ స్రవంతి

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



నెల్లూరు(వీఆర్సీ సెంటర్) : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నెల్లూరు జిల్లా, రూరల్ కార్యదర్శులు అజయ్‌కుమార్, పెంచల నరసయ్యలు పిలుపునిచ్చారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌లో హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ సర్కార్ మార్పు చేసి నాలుగు లేబర్‌కోడ్స్‌ను తీసుకొచ్చిందని, ఇవి వేతనాలు పెంచుకునే హక్కు, సమ్మె చేసే హక్కులను కాలరాసేలా ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్, అంజిరెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆనం విజయకుమార్‌రెడ్డి పరామర్శ



నెల్లూరు సిటీ : 38వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రూరల్ అధ్యక్షురాలు శారదను పార్టీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. శారద కాలికి ఆపరేషన్ చేసిన నేపథ్యంలో ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, పార్టీ నేతలు కాకుటూరు లక్ష్మీసునంద, పోతురాజు రమాదేవి, సుకుమార్‌రెడ్డి, చంద్రమౌళి, భాను ప్రకాష్‌రెడ్డి, అలీమ్, ఖలీల్, బషీరా, సునీల్, యస్దాని, ముక్తిఆర్, గయాజ్ సుభాని, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజన గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

నెల్లూరు సిటీ : ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు గిరిజనులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించనున్నట్లు రూరల్ ఎంపీడీఓ శైలేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12న పెనుబర్తి, కాకుపల్లి, కలివేలపాళెం, మాదరాజుగూడూరు గ్రామాల్లోని గిరిజనులకు కాకుపల్లి బిట్- 2 సచివాలయంలో క్యాంప్ ఉంటుందన్నారు. 13న పొట్టేపాళెం, కొండ్లపూడిలోని గిరిజనులకు పొట్టేపాళెం సచివాలయంలో, 14న కొమ్మరపూడి, దేవరపాళెం, ములుమూడి గిరిజనులకు ములుమూడి సచివాలయంలో, 15న సౌత్‌మోపూరు గిరిజనులకు స్థానిక సచివాలయంలో, 16న కందమూరు, ఉప్పుటూరు గిరిజనులకు కందమూరు సచివాలయంలో, 17న కొత్తవెల్లంటి, పాత వెల్లంటి, సజ్జాపురం, గొల్లకొందుకూరు గిరిజనులకు వెల్లంటి సచివాలయంలో, ఆమంచర్ల, దొంతాలి గిరిజనులకు ఆమంచర్ల సచివాలయంలో ఆధార్ నమోదు క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు.

రచయితలకు సన్మానం



నెల్లూరు (టౌన్) : స్థానిక మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి స్కూల్లో రచయితలు సురేష్ పిళ్లే, కృష్ణస్వామిలను నగదు పురస్కారాలతో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి అద్దేపల్లి ప్రభు మాట్లాడుతూ కవిత్వం, కథలు, నవలలు సూటిగా, స్పష్టంగా కొత్త కోణాల్లో అధ్యయనం చేసి రాసినప్పుడే కలకాలం పాఠకుల మనసులో నిలబడుతాయన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో ప్రథమ బహుమతి అన్నం శివకృష్ణ, రెండో బహుమతి రవికుమార్, మూడో బహుమతిని మునీంద్రకు రచయిత సుభద్రాదేవి అందజేశారు. కార్యక్రమంలో రచయితలు నాగగాయిత్రి, శ్రీధర్‌బాబు, నారాయణరావు, శివకుమార్, ఈతకోట సుబ్బారావు, బృందావనరావు, రామ్మోహన నరసింహం, వినయ్ పాల్గొన్నారు.


ఏపీఎన్‌జీఓ నగర ఉపాధ్యక్షుడిగా హజరత్‌రెడ్డి



అసోసియేషన్ నేతలను అభినందిస్తున్న సంఘ సభ్యులు

నెల్లూరు(అర్బన్) : ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ నగర ఉపాధ్యక్షుడిగా అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హజరత్ రెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖాళీగా ఉన్న ఈపోస్టుకు నగరంలోని ఎన్‌జీఓ భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. అలాగే సంయుక్త కార్యదర్శిగా కె.జనార్ధన్‌రాజును ఎన్నుకున్నట్టు ఎన్నికల పరిశీలకుడు ఆంజనేయవర్మ ప్రకటించారు. ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నగరాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఆత్మజ్ఞానం



నెల్లూరు(బృందావనం) : విద్య ద్వారా ఆత్మజ్ఞానం పొందగలరని గుంటూరు శృంగేరి విరూపాక్ష పీఠ సంస్థానాధీశ్వరులు గంభీరానందస్వామి అనుగ్రహభాషణ చేశారు. పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆదిశంకర సంస్మరణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం అనుగ్రహభాషణ చేశారు. ఎవరు ఎంత నేర్చుకున్నా తన కంటే చిన్నవారు మంచి విషయాలను తెలిపితే శ్రద్ధగా విని తెలుసుకోవాలంటూ ప్రవచించారు. అనంతరం ముదివర్తి లక్ష్మీకామాక్షి గాత్ర కచేరి వీనులవిందుగా సాగింది. కార్యక్రమంలో చక్రాల ఆనంద్‌కుమార్, కప్పర గిరిజాలక్ష్మి, కేవీ సుధీర్, వి.హరిప్రసాద్, ఎ.సత్యనారాయణ, ఏవీ సుధాకర్, భామాశంకర్, రాధాలక్ష్మి, చరిత తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు

- సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి

నెల్లూరు (పొగతోట) : అర్హులందరూ కొత్త రేషన్ కార్డుల కోసం సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సివిల్‌సప్లయ్స్ సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నారు. ఆయన శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 7 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. 21 రోజుల్లోపు కొత్త రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఏడు రకాల సర్వీసులను కల్పించి కొత్త కార్డు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 2,342 మంది కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటును సంప్రదిస్తే దరఖాస్తు చేస్తారన్నారు. ఈకేవైసీ ద్వారా జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష బోగస్ రేషన్‌కార్డులను గుర్తించి తొలగించామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 6.23 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే డీఎస్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 99517 78716 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. ఎండీయూ వాహనాల విషయంలో త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

అమరులకు ఘన నివాళి



ర్యాలీలో పాల్గొన్న క్లబ్ నాయకులు

నెల్లూరు(అర్బన్) : ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యానికి సంఘీభావం తెలుపుతూ వీఆర్సీ గ్రౌండ్ లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు బండారు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జై జవాన్.. జై కిసాన్ నినాదాలతో శనివారం ర్యాలీ చేశారు. యుద్ధంలో మృతిచెందిన జవాన్లు, అమాయక పౌరులకు వీఆర్సీ మైదానంలో ఘనంగా నివాళులర్పించారు. జైభారత్.. హిందుస్తాన్ జిందాబాద్.. పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్ మాట్లాడుతూ పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను పూర్తిగా మట్టుబెట్టాలని, జవాన్లకు మద్దతుగా ప్రతి పౌరుడు నిలుస్తారన్నారు. మతకలహాలను సృష్టించేందుకు పన్నాగం పన్నిన ఉగ్రవాదులను అత్యంత కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో అడ్వొకేట్ నన్నే సాహెబ్, ఎంవీఐ అజాద్‌జాకీర్, లక్ష్మణకుమార్‌రెడ్డి, శివబాల సుబ్బారావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, కాజుద్దీన్, డాక్టర్ పెంచలయ్య, విజయకుమార్, రవికుమార్, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజియన్ కౌన్సిలర్ ఎంవీ రెడ్డి, శ్రీధర్, రమణారెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన బైబిల్ శిక్షణా తరగతులు



నెల్లూరు(బృందావనం) : రైల్వేఫీడర్స్ రోడ్డులోని లోన్‌స్టార్ చర్చిలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న 'వేసవి కాలం బైబిల్ శిక్షణా తరగతులు' శనివారం ముగిశాయి. నిర్వాహకుడు, చర్చి పాస్టర్ ఐఎస్ బెన్హర్‌బాబు మాట్లాడుతూ ఐదుగురు ఉపాధ్యాయులు 100 మందికిపైగా చిన్నారులకు శిక్షణ ఇచ్చారన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపి చిన్నారులకు, పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. శైలజ బెన్హర్‌బాబు పాల్గొన్నారు.

పాస్టర్ల సతీమణులకు సన్మానం



నెల్లూరు(బృందావనం) : మదర్స్ డేను పురస్కరించుకుని 'ఆత్మీయ మాతృమూర్తుల ఆరాధన'ను నగరంలోని బాప్టిస్టు చర్చి డొనీహాల్‌లో శనివారం రాత్రి నిర్వహించారు. డాక్టర్ థియోఫిలస్ దైవోపదేశాన్ని చేశారు. అనంతరం వివిధ సంఘాల పాస్టర్ల సతీమణులను సన్మానించారు. సంఘ కాపరి దంపతులు రెవరెండ్ శ్యామ్‌సన్‌కుమార్, హుల్దా శ్యామ్‌సన్, చైర్మన్ డి.సురేంద్రబాబు, సెక్రటరీ గుర్రం అరుణ్‌కుమార్, స్త్రీల సమాజం అధ్యక్షురాలు ప్రభావతి పాల్, కార్యదర్శి అనితారాయ్, కోశాధికారి రోజ్‌మేరీ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రంగడికి బంగారు గరుడసేవ నేడు

నెల్లూరు(బృందావనం) : నరసింహ జయంతి సందర్భంగా రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారికి ఆదివారం ఉదయం బంగారు గరుడసేవ పేట ఉత్సవం జరుగనుందని ఈఓ ఎ.శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. భక్తులు దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులుకావాలన్నారు.

ఖేలో ఇండియాలో ప్రతిభ



మెడల్స్ సాధించిన తరుణీష్ జాత్యా, వైష్ణవి

నెల్లూరు (పొగతోట) : ఖేలో ఇండియా జాతీయ స్థాయి యూత్ గేమ్స్‌లో ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన తరుణీష్ జాత్యా, విజయవాడకు చెందిన వైష్ణవిలు మిక్స్‌డ్ విభాగంలో ఏపీకి బ్రాంజ్ మెడల్ సాధించారని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు శనివారం తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని బాగల్‌పూర్‌లో జరిగిన జాతీయ ఖేలో యూత్ గేమ్స్‌లో రాష్ట్రం తరఫున ఆడిన క్రీడాకారులను, కోచ్ శివశంకర్‌ను అభినందించారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

నెల్లూరు సిటీ : నగరంలోని 52వ డివిజన్‌లో బీసీ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలన్నదే మా ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. జిల్లాలో 4,967 మందికి కుట్టు మెషీన్లు ఇవ్వడంతో పాటు శిక్షణ ఇప్పిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నగరాధ్యక్షుడు మామిడాల మధు, నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, అనూరాధ, విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్) : వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావు గతంలో టీపీగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, బాలాజీనగర్ ఎస్సైగా, కావలి సీఐగా పనిచేశారు.

చేనేత పార్కును ఏర్పాటు చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని గాంధీనగర్‌లో ఉన్న ఆప్కో స్థలంలో చేనేత పార్కును ఏర్పాటు చేసి చేనేత అనుబంధ సంస్థలకు కేటాయించాలంటూ ఈ సంఘ జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు.

సింహపురికి శ్రీరంగం పెరియాశ్రమ పీఠాధిపతి

నెల్లూరు(బృందావనం) : ధర్మప్రచార విజయయాత్రలో భాగంగా శ్రీరంగం పెరియాశ్రమ పీఠాధిపతి శ్రీమద్ ఆండవన్ వరాహ మహాదేశికన్ స్వామి రంగనాయకులపేట గోపురంవీధిలో ఉన్న శ్రీవేదాంత దేశికర్ దేవస్థానానికి శనివారం ఆగమనం చేశారు. ఈ క్రమంలో ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నిర్వాహకులు వరదరాజన్, విష్ణుమోహన్, రాజగోపాల్, శ్యాంసుందర్, నరసింహ, కల్యాణ్ తదితరులు పర్యవేక్షించారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



నెల్లూరు(అర్బన్) : వైద్య, ఆరోగ్యశాఖతో పాటు సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న పలు క్యాడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఏపీజేఈఎఫ్ జిల్లా చైర్మన్, హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు ఆయా సంఘాల నాయకులతో కలిసి మంత్రి పొంగూరు నారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న వార్డ్ అడ్మిన్స్‌కు సీనియర్ అసిస్టెంట్ స్థాయిలో వార్డు ఆఫీసర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల సభ్యులు సతీష్‌రెడ్డి, బాలరాజు, అరవ పరిమళ, హరిప్రసాద్, వెంకటేష్, అశోక్, విజయలక్ష్మి, బ్రహ్మేశ్వరి, శివతేజ, కామాక్షి, శ్రీను, రమేష్, మోహన్, రాజశేఖర్, మొహరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

అమ్మణ్ణి సేవలో ఉడుపి అడమారు పీఠాధిపతి



నెల్లూరు(బృందావనం) : రాజరాజేశ్వరి అమ్మవారిని ఉడుపి అడమారు మఠం పీఠాధిపతి ఈషాప్రియ తీర్థానంద శనివారం దర్శించుకున్నారు. నగరానికి ఆగమనం చేసిన స్వామివారికి ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా ఆహ్వానించారు. దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆయన అడిగి తెలుసుకొన్నారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ షెడ్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు సిటీ : నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో రూ.12 కోట్లతో ప్రయోగాత్మకంగా నిర్మించనున్న ఎంఎస్‌ఎంఈ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ షెడ్‌కు మంత్రి నారాయణ శనివారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్‌కాలనీలోని 1,400 కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా నెల్లూరు సిటీలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ షెడ్‌కు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ నందన్, ఆర్డీఓ అనూష, ఏపీఐఐసీ జీఎం ప్రసాద్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ సింధూర్ పార్క్‌గా నామకరణం

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని ఆమంచర్లలో నిర్మించబోతున్న ఎంఎస్‌ఎంఈ పార్కుకు భారత్ సింధూర్ ఎంఎస్‌ఎంఈ పార్కుగా నామకరణం చేస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆమంచర్లలోని 60 ఎకరాల్లో పార్కుకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉందన్నారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో చండీహోమం రేపు

నెల్లూరు(బృందావనం) : వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని మూలాపేట శంకరమఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామివారి దేవస్థానంలో సాయంత్రం 4 గంటలకు చండీహోమం జరుగనుందని మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు శనివారం తెలిపారు. వేసవి దృష్ట్యా హోమాన్ని సాయంత్రం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

నేత్రపర్వంగా కైలాససేవ



నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న వసంతోత్సవాలు శనివారంతో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారికి కైలాససేవ అలంకార ఉత్సవం నయనానందకరంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా విచ్చేసి సర్వాలంకార శోభితంగా కొలువైన స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా మోదెం సత్యనారాయణగుప్తా వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

కాశీవిశ్వనాథునికి రావణసేవ



నెల్లూరు(బృందావనం) : ఉస్మాన్ సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి స్వామివారికి రావణసేవ నేత్రపర్వంగా గావించారు. విశేషాలంకారంలో కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా కొలపర్తి వెంకటరమేష్‌కుమార్- సువర్ణలక్ష్మి దంపతులు వ్యవహరించారు. దేవస్థానం ఈఓ జీసీహెచ్ దర్గయ్య పర్యవేక్షించారు.